

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

లారీ ఢీకొనడంతో నుజ్జయిన శరీర భాగాలు

6



సక్రిబాయి (ఫైల్)



సుభాష్ (ఫైల్)

భూ భారతిని సమర్థవంతంగా అమలు చేయాలి

- 17 నుంచి 30 వరకు రైతులకు అవగాహన
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూభారతిని సమర్థవంతంగా అమలు చేయాలని రెవెన్యూ అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం భూభారతి పోర్టల్ అమలుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ పోర్టల్‌పై ఈ నెల 17 నుంచి 30 వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. రైతులు, ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని, భూ సమస్యలకు పరిష్కారాలు చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



భూ భారతి పోర్టల్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసిన గ్రామాలు కాకుండా మిగిలిన గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాలమేరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ, మండల ప్రత్యేకాధికారులు సమన్వయంతో లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. అలాగే, ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారి మధుసూదన్, డీపీవో సాయిబాబ, డీసీవో కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ చలపతిరావు, అదనపు డీఆర్డీవో బాలరాజు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ర్యాలీలో నిర్మలా జగ్గారెడ్డి

- ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి





సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన మహా ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. పోతిరెడ్డిపల్లి పీఎస్ఆర్ గార్డెన్ నుంచి పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన మహార్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఆయన సూచించిన లక్ష్యసాధన కోసం అన్నివర్గాలు పనిచేయాలన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జయంతి మహార్యాలీ ఉత్సవ కమిటీ కన్వీనర్ అనంతయ్య, కోకన్వీనర్ విజయరావు, గంగేరి శ్రీహరి, కసిని శ్రీకాంత్, జైపాల్ నాయక్, కో ఆర్డినేటర్లు దుర్గాప్రసాద్, అశోక్‌కుమార్, జగన్, నాగరాజు, పవన్, సురేష్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రణాళికతో తాగునీటి సరఫరా

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పక్కా ప్రణాళికతో తాగునీరు అందజేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం వచ్చే వరకు తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యేక సమ్మర్ యాక్షన్‌ప్లాన్ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని పరఫరా చేయాలని పేర్కొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఇందిరమ్మ ఇళ్ల కోసం దారిద్య్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామం నుంచి లబ్ధిదారుల జాబితా తయారుచేసి, గెజిటెడ్ అధికారులచే విచారణ చేయిస్తామని తెలిపారు. ప్రతీ గెజిటెడ్ అధికారికి 200 మంది లబ్ధిదారుల జాబితా ఇస్తామని, ప్రతీ రోజు 25 మంది చొప్పున 8 రోజుల్లో విచారణ ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఆర్వో భుజంగరావు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహనా సదస్సులు

జిల్లావ్యాప్తంగా భూ భారతి చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూభారతి వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడుతూ నూతన చట్టంపై ఆరు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఈ చట్టంపై నిశితంగా అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, సభ్యులను కూడా సదస్సులలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఆర్వోఆర్ తప్పుల సవరణ సెక్షన్-4, 5, 7 గురించి, అప్పీల్ ఆప్షన్లపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సదస్సులలో వివరించాలని సూచించారు. ప్రతి ఏటా డిసెంబరు 31న భూములకు సంబంధించిన పహణీలను ఆన్‌లైన్‌లో కాకుండా హార్డ్‌కాపీలనూ జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో నిర్దేశించిన కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. తద్వారా రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో అందుతాయన్నారు. అకాలవర్షాల వల్ల ధాన్యం తడవకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. తేమ శాతం రాగానే వెంటనే కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తహసిల్దార్లు, సివిల్‌సప్లై అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో తాగునీటిని సరఫరా చేస్తున్న వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ట్యాంకర్

గొంతెండ కుండ

మండుటెండల్లో మానవత

- తాగునీరు, మజ్జిగ, అంబలి, నిమ్మరసం పంపిణీ
- ఉమ్మడి మెదక్ వ్యాప్తంగా చలివేంద్రాల ఏర్పాటు
- స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, వ్యక్తుల దాతృత్వం
- మరిన్ని చోట్లా ప్రారంభిస్తే ప్రయాణికులకు ఊరట

వేసవి వచ్చిందంటేనే తడారిన గొంతులు దాహం కోసం తపిస్తుంటాయి. ఇల్లు దాటితే తాగునీటి కోసం డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితే. ఆర్థిక స్థోమత లేనివారు వాటర్ బాటిళ్లను కొనుగోలు చేయడానికి తర్జన భర్జన ఎడుతుంటారు. ఇలాంటి వారి దాహార్తిని తీర్చడానికి కొంత మంది స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. చల్లటి తాగునీటి చలివేంద్రాలే కాకుండా అంబలి, నిమ్మరసం, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా మండుటెండల్లో మానవత్వాన్ని చాటుతున్నవారిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



> 'సంగారెడ్డి పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను గట్టెక్కించడానికి తనవంతు సాయంగా వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ ముందడుగు వేశారు. తమ సంస్థ తరఫున ఒక వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేసి నిత్యం తాగునీటిని అందిస్తున్నారు. ఆయన ధాతృత్వాన్ని కలెక్టర్ క్రాంతి వల్లూరు సైతం ప్రశంసించి మరొక ట్యాంకర్‌ను ఏర్పాటు చేయాలని కోరడంతో ప్రస్తుతం రెండు ట్యాంకర్లతో నిరంతరం తాగునీరు సరఫరా చేయిస్తున్నారు'.

> 'కొమురవెల్లి మండలం కిష్టంపేటకు చెందిన బొంగు రాజేందర్‌రెడ్డి సిద్దిపేట పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తుంటారు. వేసవి రాగానే 45రోజుల పాటు మజ్జిగ, నిమ్మరసం కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. బీఆర్ఆర్ సేవాసంస్థ ద్వారా ఉచితంగా నిత్యం సుమారు 500 మందికి స్వచ్ఛమైన నిమ్మరసం పంపిణీ చేస్తున్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోనూ చలివేంద్రాన్ని ప్రారంభించి భక్తులకు ఉపశమనం కలిగిస్తున్నారు.'

> 'మెదక్‌లోని మాతా బోరంచమ్మ ఆలయం ఆధ్వర్యంలో ఉగాది నుంచి సుమారు 110 రోజుల పాటు నిత్యం అంబలి పంపిణీ చేస్తున్నారు. ప్రతీ మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద భోజనంతోపాటు అంబలి అందజేస్తూ మండుటెండల్లో మానవత్వం చాటుతున్నారు. రోజుకు దాదాపు 700 మంది ఉచితంగా అంబలి సేవిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా నిరాటంకంగా సేవ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 15: ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుతున్న పరిస్థితి. వేసవి ప్రతాపానికి తాళలేక వడదెబ్బతోనూ చనిపోయినవారు, అస్వస్థతకు లోనైనవారు ఉన్నారు. ఇలాంటి ఆపత్కాల పరిస్థితుల్లో సామాజిక సేవను చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గడిచిన 15 రోజుల నుండి మెతుకుసీమలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే మరికొందరు కూడా ఈ కోణంలో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. జనసంచార ప్రాంతాల్లో దాహం తీరక ఇబ్బందులు పడేవాళ్లు ఎందరో ఉన్నారు. ఆ సమయంలో చలివేంద్రాలు, మజ్జిగ, అంబలి, నిమ్మరసం కేంద్రాలే ఆసరాగా నిలుస్తున్నాయి.

దప్పిక తీర్చడమే లక్ష్యంగా..

- చిలప్‌చెడ్ మండలం గౌతపూర్ గేటు వద్ద గ్రామ యువత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి కుండల ద్వారా చల్లటి నీళ్లు అందిస్తున్నారు.
- హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాటర్ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసి నీళ్లు పంపిణీ చేస్తున్నారు.
- సత్యసాయిసేవా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలుచోట్లా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.
- గజ్వేల్ పట్టణానికి చెందిన అమర నాగేందర్, జగ్గయ్యగారి శ్రీనివాస్‌లు సొంత ఖర్చులతో చలివేంద్రాలు ప్రారంభించారు.
- నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్ చౌరస్తా, వల్లూరు శివారుల్లో దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.
- కల్హేర్‌లో మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి సాయిలు తన తల్లిదండ్రుల పేరిట అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు.
- కుకునూరుపల్లి బస్టాండ్ వద్ద బీజేపీ నేతలు చలివేంద్రం ప్రారంభించారు.
- మాసాయిపేట మండల కేంద్రంలో పోతన్‌శెట్టిపల్లికి చెందిన వెన్నవరం శ్రీనివాస్‌రెడ్డి గత ఎనిమిదేళ్లుగా తన సొంత ఖర్చులతో మంచినీటిని అందిస్తున్నారు.
- చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ రెండు చలివేంద్రాలను

మిగతా 7వ పేజీలో..

రోజూ 30వేల లీటర్ల తాగునీరు పంపిణీ



వాసవి మాఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేసవిలో నాలుగు నెలలు రోజుకు 30వేల లీటర్ల తాగునీటిని సంగారెడ్డి పట్టణంలో పంపిణీ చేస్తున్నాం. మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తాగునీటి ఎద్దడి ప్రతీ కాలనీకి నీరు చేరవేస్తున్నాం.

-తోపాజీ అనంతకిషన్, వాసవీ మాఇల్లు స్వచ్ఛందసంస్థ, అధ్యక్షుడు

టీచర్లకు 'ప్రవేశ' పరీక్ష!

ఎక్కువ మందిని చేర్పిస్తే సర్వీసు రికార్డులో పాయింట్‌లు

పదోన్నతులు, బదిలీల్లో ప్రాధాన్యం!



(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో ప్రవేశాల సంఖ్య ఏటా తగ్గిపోతున్నది. బడిబాట కార్యక్రమంతో ఆశించిన స్థాయిలో ప్రవేశాలు పెరగడం లేదు. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లో టీచర్లకు అడ్మిషన్స్‌పై ప్రత్యేక టాస్క్ ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. సర్కారు బడుల్లో విద్యార్థులను చేర్పించేలా ప్రతీ టీచర్‌కు టార్గెట్ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను విద్యాశాఖ సిద్ధం చేస్తున్నది.

టీచర్లకు పాయింట్లు, ప్రాధాన్యత

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఈ వేసవి సెలవుల్లో 'ప్రవేశ' పరీక్ష ఎదుర్కోనున్నారు. ప్రభుత్వం ప్రవేశాల కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమంలో భాగంగా లక్ష్యాలను అనుగుణంగా విద్యార్థులను చేర్పించిన ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించనుంది. ఈ పాయింట్లను ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డుల్లో చేర్చి బదిలీ, పదోన్నతులు సందర్భంలో ప్రాధాన్యత కల్పించనున్నారు. త్వరలోనే దీనిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగేలా ప్రచారం చేయడం, తదితర అంశాలపై దశల వారిగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యాచరణ సత్ఫలితాలనిస్తే సర్కారు బడుల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశముంది.

బడిబాట సరిపోతుంది



విద్యార్థుల అడ్మిషన్లపై వేసవి సెలవుల్లో ప్రత్యేక టాస్క్ అవసరం లేదు. ప్రతి ఏటా నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తే సరిపోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

-ఎం.సోమశేఖర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఎలాంటి ఆదేశాలు రాలేదు



వేసవి సెలవుల్లో సర్కారు బడుల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉపాధ్యాయవర్గాల్లో విద్యార్థుల చేరికల ప్రక్రియపై చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం నిర్దేశిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో

జేఎన్టీయూలో '2కే25 ఫెస్ట్' షురూ

- విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలించిన ప్రిన్సిపాల్
- 17న వార్షికోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థుల ఆవిష్కరణను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

పుల్‌కల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో '2కే25 ఫెస్ట్' మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ జి.నరసింహ వివిధ విభాగాలకు సంబంధించిన ఇన్నోవేషన్స్‌ను ప్రారంభించారు. ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏటా మూడురోజులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. 13వ టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఏడాది పాటు తాము చదువుకున్న తమ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి ప్రాజెక్టుల రూపంలో తయారుచేసి ప్రదర్శించారు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర ఇంజనీరింగ్ డిపార్టుమెంట్లకు సంబంధించి ఈ నెల 16, 17 తేదీల్లో మరిన్ని ఈవెంట్లు ఉంటాయని, చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్ రావు, వివిధ విభాగాల అధిపతులు, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగమప్ప ఆర్ట్స్ అదరహో..


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మనువడితో ఉన్న చిత్రాన్ని గీసి ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి బహూకరిస్తున్న ఆగమప్ప

- మాటలు రాకున్నా.. చిత్రాలు గీయడంలో దిట్ట
- శభాష్ అనిపించుకుంటున్న కడ్పల్ గ్రామ యువకుడు

నారాయణఖేడ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే మాటలు రాక పోయినా.. పట్టుదలతో శ్రమించి, చిత్రాలు వేస్తూ పెన్సిల్ ఆర్ట్‌కు జీవం పోస్తున్నాడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలోని సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన ఆగమప్ప. గూడురు శ్రీశైలం, గూడురు మల్లమ్మలకు మొదటి సంతానమైన అతడు పుట్టుకతోనే మూగ. ఆగమప్పకు చదువు అంటే చాలా ఇష్టం. గ్రామంలోనే పదవతరగతి వరకు చదివాడు. అనంతరం ఇంటర్, బీకాం పూర్తి చేశాడు. మాటలు రాక పోయిన తాను కూడా పలువురితో ఔరా అనుపించుకోవాలనే పట్టుదలతో పెన్సిల్ ద్వారా చిత్రాలు వేయడం స్వయంగా నేర్చుకున్నాడు. ఇప్పటి వరకు 500ల వరకు పెన్సిల్ ఆర్ట్ చిత్రాలను వేశాడు. ఆగమప్ప ఎవ్వరినైనా చూడగానే పది నిమిషాల్లో వారి చిత్రాన్ని పెన్సిల్‌తో ఉన్నది ఉన్నట్లుగా చక్కగా వేస్తాడు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అయోధ్య బాలరాముడి చిత్రాలు, శివాజీ మహారాజ్, అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్, మల్లన్న గుట్ట పీఠాధిపతి బసవలింగ మహారాజ్, వ్యాస మహర్షి చిత్రాలతో పాటు అనేక చిత్రాలను తన పెన్సిల్ తో చక్కగా వేశారు. మాటలు రాక పోయినా నిరాశకు లోను కాకుండా చిత్రాలకు ప్రాణం పోస్తున్నాడు. విధి వక్రీకరించినా పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని నిరూపిస్తున్నాడు ఆగమప్ప. నారాయణఖేడ్ ప్రాంతానికి ప్రముఖులు ఎవ్వరూ వచ్చిన ఆగమప్ప నిమిషాల్లో పెన్సిల్ ఆర్ట్‌తో చిత్రాన్ని వేసి బహూకరిస్తాడు.



ఆగమప్ప గీసిన చిత్రాలు



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

- లారీ ఢీకొనడంతో

నుజ్జు, నుజ్జు అయిన శరీర భాగాలు

కల్హేర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజుల్లో తండ్రి కాబోతున్నానన్న ఆనందంతో కొడుకు, చాలా రోజులకు తమ ఇంట్లో సంతానం కలుగుతుందన్న తల్లి ఆనందాన్ని మృత్యువు రూపంలో వచ్చిన లారీ చిదిమేసింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామం వద్ద 161వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు మరణించారు. మృతులు మెదక్ జిల్లా రేగోడ్ మండలం పట్టి పోలం తాండాకు చెందిన లావుడియా సక్రిబాయి(58), లావుడియా సుభాష్(25)గా గర్తుంచారు. ద్విచక్ర వాహనంపై తమ తాండా నుంచి కామారెడ్డి జిల్లా బాన్సువాడ సమీపంలోని సుభాష్ అత్తగారి తాండాకు వెళ్తున్నారు. గర్భవతి అయిన సుభాష్ భార్య రెండు, మూడు రోజుల్లో ప్రసూతి అయ్యే అవకాశాలు ఉండటంతో అత్తగారి వద్ద ప్రసూతి ఖర్చుల కోసం డబ్బులు తీసుకువచ్చేందుకు తల్లి సక్రిబాయితో కలిసి వెళ్తుంగా, వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ బలంగా ఢీకొనడంతో తల్లి, కొడుకులు అక్కడిక్కడే మరణించారు. వారి శరీర బాగాలు నుజ్జు, నుజ్జు కావడంతో గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. సమాచారమందుకున్న కల్హేర్ పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న కల్హేర్ పోలీసులు దర్యాప్తు జేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. ఒకరి మృతి


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

శివ్వంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి గజ్వేల్ జాతీయ రహదారి దొంతి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన సీతాల వెంకటేష్(40) భార్య సుమలతతో కలిసి తూప్రాన్ ఆసుపత్రిలో బంధువులను పరామర్శించడానికి బైక్‌పై వెళ్తున్నాడు. దొంతి శివారులోని బ్రిడ్జి వద్దకు రాగానే గజ్వేల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 15 యూబీ1300) గజ్వేల్ నుంచి సంగారెడ్డి వైపు అతి వేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలంలో భార్య భర్త మృతదేహంపై పడి రోధించడం పలువురిని కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ సలీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

పుల్‌కల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామానికి చెందిన దంతెల సాయిరాజ్ (30), దంతెల బాలయ్య (39) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. స్వగ్రామంలో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతికి హాజరై రాత్రి బైక్‌పై తిరిగి బయలుదేరారు. రాత్రి 12 గంటలకు శివంపేట శివారులోని బీరు పరిశ్రమ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న దంతెల బాలయ్య (39) తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, దంతెల సాయిరాజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహనికి పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రేవతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..


గోపాల్ (ఫైల్)

పాపన్నపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాకు చెందిన లునావత్ గోపాల్(39) మహిళా వేషధారణలో అడుక్కుంటూ జీవనం సాగిస్తుండేవాడు. రోజు మాదిరిగానే ఈ నెల 12న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం చెరువులో గోపాల్ మృతదేహన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. స్నానం కోసం వెళ్లి చెరువులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పావన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

అత్యాచారం, హత్యాయత్నం కేసులో

నిందితుడి అరెస్టు


నిందితుడిని చూపుతున్న పోలీసులు

జోగిపేట రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారం చేసి, ఆపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను మంగళవారం జోగిపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అనిల్ వెల్లడించారు. వట్‌పల్లి మండలానికి చెందిన ఓ మహిళ తను కొనుగోలు చేసిన చీరకు డ్యామేజ్ ఉండడంతో తిరిగి ఇచ్చేందుకు ఇటీవల జోగిపేటలోని బట్టల షాపు వెళ్లింది. ఈ క్రమంలో మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామానికి చెందిన నరేష్‌రెడ్డి ఆమెతో పరిచయం పెంచుకుని ఇంటి వద్ద దించుతానని నమ్మబలికి తన స్కూటీపై ఎక్కించుకుని వెళ్లాడు. మార్గమధ్యలో మద్యం కొనుగోలు చేసి అందోల్ మండలంలోని అన్నసాగర్ శివారులో మద్యం సేవించి ఆమెపై అత్యాచారం చేశాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామ శివారులోకి రాగానే ఆమె చెవి కమ్మలు లాక్కొని కత్తితో దాడికి యత్నించాడు. ప్రతిఘటించిన ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తుండగా.. వెంటనే కాలువలోకి తోసివేసి మెడలో ఉన్న చైన్, ఫోన్‌ను లాక్కొని పారిపోయాడు. మరుసటి రోజు బాధితురాలు వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్ పంపించినట్లు సీఐ తెలిపారు.

నెలలు నిండని గర్భిణి 108లో ప్రసవం


అంబులెన్స్‌లో తల్లీబిడ్డలు

కొండపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండని గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేసి తల్లి బిడ్డలను ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మారెడ్డిపల్లి శివారులో ఓ ఫామ్ హౌస్‌లో ఒడిస్సాకు చెందిన సురేందర్ కుటుంబంతో నివాసముంటున్నారు. ఆయన భార్య త్రివేణికి నెలలు నిండకుండానే మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. సురేందర్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ ఆమెను పరిశీలించారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోకి కూడా తీసుకువచ్చే పరిస్థితి లేకపోవడంతో అక్కడే సుఖ ప్రసవం చేశారు. పుట్టిన మగబిడ్డ తక్కువ బరువు ఉండడం.. ఎటువంటి చలనం లేకపోవడంతో పరిస్థితిని 108 ప్రధాన కార్యాలయం వైద్యుడు పార్థసారధికి సిబ్బంది సమాచారం అందించారు ఆయన సూచనలతో బిడ్డకు సీపీఆర్ చేసి కాపాడారు. అనంతరం తల్లిబిడ్డలను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.

'డంపుయార్డు అనుమతులు రద్దు చేయండి'


అధికారులు వినతిపత్రాలను అందజేస్తున్న ప్రజలు

గుమ్మడిదల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలని ప్రజలు అధికారులకు విన్నవించారు. డంపుయార్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఈ నెల 3న ప్రజాఅభిప్రాయం కోరింది. దీంతో కొత్తపల్లి, నల్లవల్లి గ్రామస్థులు ఇప్పటికే డంపుయార్డు మాకొద్దు అంటూ అధికారులకు వినతి పూర్వకంగా అభిప్రాయాన్ని తెలిపారు. మిగిలిన గ్రామాల ప్రజలు డంపుయార్డుకు వ్యతిరేకంగా మంగళవారం గుమ్మడిదల రెవెన్యూ కార్యాలయ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మరోవైపు గుమ్మడిదల మండల కేంద్రంలో రిలే నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. అనంతారం గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జైపాల్ రెడ్డి, మండల నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మద్దుల బాల్ రెడ్డి, సదానంద రెడ్డి, మొగులయ్య, భిక్షపతి రెడ్డి, యాదిరెడ్డి, గోపాల్, సూర్యనారాయణ, యాదయ్య, రాజు, రామ్ రెడ్డి, పెంటయ్యమండల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కవి వెంకట్‌కు ఘన సన్మానం


కవి వెంకట్‌ను సన్మానిస్తున్న శతావధాన నిర్వాహకులు

చేర్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్యకవి వెంకట్ శతావధాన ప్రాశ్నిక సన్మానం అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, అవధాన విద్యావికాస పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో సంపూర్ణ శతావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ వర్ణన అనే అంశంలో ప్రశ్నలను సంధించారు. ఈ మేరకు ఆయనను నిర్వాహకులు ప్రశంసాపత్రం అందించి సత్కరించారు.





ప్రారంభం కాకుండానే పాడవుతున్నాయ్..

మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని చిల్డ్రన్ పార్కు

నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్న వైనం

రూ.కోట్లు వృథా

సదాశివపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సదాశివపేట పట్టణంలోని చిల్డ్రన్ పార్కు ప్రాంభానికి ముందే శిథిలావస్థకు చేరుతున్నది. బల్దియా రూ.2కోట్ల వ్యయంతో అధునాతనంగా, అద్భుతంగా నిర్మించింది.. కానీ మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. రాజకీయ నాయకుల మధ్య విభేదాలే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. శతాబ్దాల ఘన చరిత్ర ఉన్న సదాశివపేటలో ఒక్క పార్కు కూడా లేదు. ప్రస్తుతం నిర్మించిన ఈ పార్కు కూడా ప్రారంభానికి నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దిన పార్కు. పార్కులోని బొమ్మలన్నీ నిర్వహణ లేక ధ్వంసమవుతున్నాయి. పార్కులో.. ఏనుగుల విగ్రహాల దంతాలు ఊడిపోయాయి. నెమళ్ల ఈకలు నేల రాలిపోయాయి. కొంగల ముక్కులు విరిగిపోయాయి. కోతుల తోకలు కత్తిరించబడ్డాయి. జింకల కొమ్ములు, తాబేళ్ల ఆనవాళ్లు కనిపించడం లేదు. జీవవైవిధ్యానికి అద్దం పట్టే జంతువులు, పక్షుల బొమ్మలు రంగులు తేలిపోయాయి. ముచ్చటగా మూడేళ్లుగా పార్కు అంతా చెడిపోతున్నది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పార్కును అందుబాటులోకి తేవాలని స్థానికులు, చిన్నారులు కోరుతున్నారు.

అనువర్తిత జానపదంపై అధ్యయనం పెరగాలి

● జానపద సాహిత్యంపై జాతీయ సదస్సు షురూ


సదస్సు ప్రారంభం సందర్భంగా కళాశాలలో తెలుగు విభాగం అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జానపద సాహిత్యం పునర్మూల్యాంకనం అనే అంశంపైన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. బిరుదురాజు రామరాజు శతజయంతిని పురస్కరించుకుని తెలుగు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అంతర్జాల జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సు కన్వీనర్ తెలుగు శాఖాధ్యక్షుడు డా. మట్టా సంపత్ కుమార్ రెడ్డి ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు ఎంతైనా అవసరమన్నారు. జానపద విజ్ఞాన సాహిత్యం నుంచి నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయన్నారు. ఆత్మీయ అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షుడు సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ జానపదంలో కూడా జ్యోతిష్య స్పృహ ఉందన్నారు. కీలక ఉపన్యాసకులు, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు జానపద ఆచారాలనెన్నో మనిషి ఆచరిస్తాడన్నారు. విశిష్ట అతిథి కంచి విజయలక్ష్మి బిరుదు రాజు రామరాజు సాహిత్యం జీవితం గురించి తెలియజేశారు. ప్రత్యేక అతిథి రామరాజు కూతురు బిరుదు రాజు పద్మావతి మాట్లాడుతూ తన తండ్రి నుంచి నేర్చుకున్న సాహిత్యం వల్ల గ్రూప్ వన్ ఉద్యోగాన్ని సాధించగలిగానన్నారు. కార్యక్రమంలో సమన్వయ కర్త పిట్ల దాసు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పి.అయిల్యో రెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా. మధుసూదన్, నారోజు వెంకట రమణ, చక్రహరి రమణ, సంపత్, రామస్వామి, నరేష్, శైలజ, నర్సింహులు, డా.ఉమా మహేశ్వరి, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌తో రక్తమోడుతున్న దండకారుణ్యం

● నక్సల్స్‌తో చర్చలు జరిపి ప్రజాసమస్యలు పరిష్కరించాలి

● అరుణోదయ విప్లవ సాంస్కృతోద్యమ ప్రజా గాయకురాలు విమలక్క


హుస్నాబాద్‌లో అమరుడైన సహదేవరెడ్డి కుటుంబంతో విప్లవ ప్రజాగాయకురాలు విమలక్క

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో రక్తమోడుతుందని, నక్సల్స్ గ్రహించి తాము చర్చలకు సిద్ధమని రావడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, ఇరువైపులా చర్చలు జరిగి ఆ చర్చలతో ప్రజా సమస్యలు పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు అరుణోదయ విప్లవ సంస్కృతోద్యమ గాయకురాలు విమలక్క అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన నక్సలేట్ రిక్కల సహదేవరెడ్డి కుటుంబాన్ని విమలక్క పరామర్శించి మాట్లాడారు. ఇరువర్గాల మధ్య శాంతి చర్చలు జరిగిన నాడు.. ప్రజల సమస్యలు నెరవేర్చిననాడు.. సమస్యలకు పరిష్కారం దొరికినపడు.. హుస్నాబాద్ రిక్కల సహదేవరెడ్డితో పాటు భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరులందరి కల నెరవేరినట్లన్నారు. అమరవీరుల ఆశయాల నెరవేర్చడానికి ఇక్కడ ఉన్న పౌరసమాజం ఆలోచన చేసి ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. అలాగే ముంచుకొస్తున్న ఫ్యాక్సిజానికి వ్యతిరేకంగా విశాల దక్పదంతో, విశాలమైన ప్రాతిపాదికపైన ఒక ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి కృషిజరగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆవైపున పోరాడే వారందరి పక్షాన మనమంతా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా అమరులైన వీరులకు జోహార్లర్పించారు. ఆమె వెంట జేఏసీ నాయకులు మేకల వీరన్నయాదవ్, ముప్పిడి రాజిరెడ్డి, సహదేవరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.

కుడి కంటి పైభాగంలో గుచ్చుకున్న స్క్రూ డ్రైవర్

● రెండు గంటల పాటు సర్జరీ ● తొలగించిన గాంధీ వైద్యులు


సర్జరీ ముందు


సర్జరీ తరువాత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కుడి కంటి పైభాగంలో గుచ్చుకున్న స్క్రూ డ్రైవర్‌ను గాంధీ ఆస్పత్రి న్యూరాలజికల్ విభాగం వైద్యులు రెండుగంటల పాటు శ్రమించి తొలగించారు. బాధితుడిని ముప్పు నుంచి తప్పించారు. ఎలక్ట్రికల్ మెకినిక్‌గా పనిచేసే మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామానికి చెందిన రంజిత్ (20) ఈనెల 8వ తేదీన పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కుడికంటి పై భాగంలో స్క్రూ డ్రైవర్ గుచ్చుకుని లోతుగా చొచ్చుకుపోయింది. దీంతో కుటుంబ సభ్యులు అతని బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో నిమ్స్‌కు రెఫర్ చేస్తూ పంపించారు. అయితే, నిమ్స్ వైద్యులు అతన్ని పరీక్షించి గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. గాంధీ ఆస్పత్రి నేత్ర వైద్యులు పలు పరీక్షలు చేసి ఎముకను చీల్చుకుని (ఫ్రంటల్ లోబ్) లోపలి వరకు స్క్రూ డ్రైవర్ చొచ్చుకుని పోయినట్లు గుర్తించారు. కంటి ఎలాంటి అపాయం కలగలేదని నేత్ర వైద్యులు నిర్ధారించారు. దీనిని తొలగించడానికి న్యూరోసర్జికల్ వైద్యులకు రెఫర్ చేశారు. రోగిని పరిశీలించిన న్యూరో సర్జికల్ వైద్య బృందం రెండు గంటల పాటు సర్జరీ చేసి రోగికి కంటి పై భాగంలో గుచ్చుకున్న స్క్రూ డ్రైవర్‌ను తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని, కంటి చూపునకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని వైద్యులు పేర్కొన్నారు.

సిద్దేశ్వర పటేల్ ఆమరణ నిరాహార దీక్షకు అండగా నిలవాలి

● బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బోయ రాములు, సామాజిక తెలంగాణ ఉద్యమ నాయకుడు మోహన్ రెడ్డి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బోయ రాములు

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్, 15(ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యల సాధన కోసం తెలంగాణ బిడ్డ బత్తుల సిద్దేశ్వర పటేల్ ఢిల్లీలో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ప్రతి తెలంగాణ బిడ్డ అండగా నిలవాలని బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బోయ రాములు, సామాజిక తెలంగాణ ఉద్యమ నాయకుడు మోహన్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రమేష్ అన్నారు. దేశవ్యాప్తంగా కులగనన చేయాలని, తెలంగాణలో బీసీలను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షను భగ్నం చేయడానికి పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. బీసీ, మైనారిటీ, దళిత, బహుజనులకు కోసం ఆయన చేస్తున్న పోరాటానికి మద్దతుగా సిద్దిపేటలో సంఘీభావ సమావేశం నిర్వహించ తలపెట్టామని తెలిపారు. ఈ మేరకు కార్యక్రమం కరపత్రికను సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బెట శ్రీనివాస్, బీసీ ఆజాదీ జేఏసీ నాయకులు సత్యనారాయణ, వేణు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు!

● కొత్తగా 119 మంది విధుల్లోకి..

● త్వరలో వారి చేతికి స్టీరింగ్

● డ్రైవర్ల కొరత దృష్ట్యా ఆర్టీసీ చర్యలు



సంగారెడ్డిలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్ల కొరతను తీర్చేందుకు ఆ సంస్థ చర్యలు తీసుకున్నది. రోడ్డు రవాణా సంస్థలో రెగ్యులర్ డ్రైవర్ల నియామకాలు జరగక ఏళ్లు గడుస్తున్నది. ఏటా పదుల సంఖ్యలో డ్రైవర్లు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీలు ఏర్పడుతున్నాయి. దీంతో మెదక్ రీజియన్ వ్యాప్తంగా ఉన్న వివిధ ఆర్టీసీ డిపోల్లో డ్రైవర్ల కొరత ఏర్పడుతున్నది. ఈ సమస్యను అధిగమించేందుకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన కాంట్రాక్ట్ పొంది ఆర్టీసీ డ్రైవర్ల నియామకానికి అవసరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇదిలా ఉండగా మెదక్ రీజియన్ వ్యాప్తంగా సుమారు 990 డ్రైవర్ పోస్టుల మంజూరి ఉండగా ఉద్యోగ విరమణలతో క్రమక్రమంగా డ్రైవర్ల కొరత ఏర్పడడంతో తాజాగా ఆ సంస్థ 119 మంది డ్రైవర్లను నియామకానికి చర్యలు తీసుకుంది. ఇప్పటికే వారు శిక్షణలో ఉండగా త్వరలో వారు ఆర్టీసీ బస్సు స్టీరింగ్ పట్టనున్నారు. ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల నియామకంతో మెదక్ రీజియన్ వ్యాప్తంగా డ్రైవర్ల కొరత కొంత మేర తీరిందని రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ బ్రాహ్మణ బంజేర్‌పల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాహ్మణ బంజేర్‌పల్లికి చెందిన మద్దురిసాయిలు కూతురు పెళ్లికి, ఇల్లు నిర్మాణానికి అప్పులు చేశాడు. దానికితోడు అనారోగ్య సమస్య తలెత్తడంతో ఏం చేయాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 12న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం గజ్వేల్ మండలం సంగాపూర్ గ్రామ శివారులోని బావిలో అతడి మృతదేహం పైకి తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి..


ఐలయ్య (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని బయ్యారం గ్రామానికి చెందిన కామల్ల ఐలయ్య(40) తాగుడుకు బానిసై ఏ పనిచేయకుండా తిరుగుతున్నాడు. ఈ నెల 8న తాగిన మత్తులో ఇంటి వద్ద ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య మొదట గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

గొంతెండకుండ


సిద్దిపేటలో నిమ్మరసం పంపిణీ చేస్తున్న బొంగు రాజేందర్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేయించారు.

- నారాయణఖేడ్ ప్రాంతంలో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ గత నెలరోజులుగా ఉపాధిహామీ కూలలకు మొబైల్ వాహనాల ద్వారా అంబలి పంపిణీ చేయిస్తున్నారు.
- సిద్దిపేట రూరల్ మండలం బండచర్లపల్లిలో పోతరాజు రమేశ్, వెంకటాపూర్‌లో బచ్చుగాని మంజుల, నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఉన్నాయి.
- మనోహరబాద్ మండలం పరికిబండలో మంచా శ్రీరామ్, కోనాయిపల్లిలో మన్నె కళ్యాణ్‌లు చలివేంద్రాలను ఏర్పాటు చేసి నీళ్ల పంపిణీ చేస్తున్నారు.
- సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వద్ద అంబలి పంపిణీ జరుగుతున్నది.
- శివ్వంపేట మండల కేంద్రంలో పులిమామిడి స్రవంతి నవీన్‌గుప్తా ఆధ్వర్యంలో నిరంతరంగా మినరల్‌వాటర్‌ను అందిస్తున్నారు.
- సిద్దిపేట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీనివాస సేవాసమితి ఆధ్వర్యంలో అంబలి, కమాన్ సమీపంలో పార్వతిమాత ఫ్యామిలీ యూత్ అసోసియేషన్, వాసవిమాత ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.
- రాయికోడ్‌లో శాంతిఫౌండేషన్, ఏబినేజర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు నడుస్తున్నాయి.
- ఝరాసంగంలో విజయ్ అనే వ్యక్తి తన సొంత డబ్బులతో చలివేంద్రం ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచాడు.
- జహీరాబాద్ పట్టణంలో వెంకటేశ్వర షాపింగ్ మాల్ నిర్వాహకులు ప్రతీ వేసవిలో అంబలి, మజ్జిగ పంపిణీ చేస్తారు. సఫైబైతుల్ మాల్ స్వచ్ఛంధ సంస్థ తరపున ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మంచి నీటిని అందిస్తున్నారు.
- చిన్నకోడూరు మండలం రామునిపట్లలో పంతం శ్రీలత,సంతోష్‌లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- సంగారెడ్డిలోని చందన బ్రదర్స్, కొత్త బస్టాండ్ సమీపంలో గల రాందేవ్ గిఫ్ట్ ఆర్టికల్ ఆధ్వర్యంలో కూల్‌క్యాన్ల ద్వారా నీళ్లందిస్తున్నారు.
- నార్సింగి మాజీ సర్పంచ్ ఎర్రం అశోక్ తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం వేసవి దృష్ట్యా మినరల్ వాటర్ అందిస్తున్నారు.
- మెదక్‌లో గత పదేళ్లుగా రాజరాజేశ్వరి మెడికల్ షాపు యజమాని రవీందర్ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.
- తూప్రాన్ పట్టణానికి చెందిన శివరాం, పోల మాణిక్యంలు సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ప్రతీరోజు మధ్యాహ్నం అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు.
- చేర్యాలలో మాజీ మంత్రి నిమ్మ రాజిరెడ్డి మనవడు అఖిల్‌రెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు.


తూప్రాన్ పట్టణంలో అంబలి పంపిణీ

న్యూస్ బాక్స్

మునిపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రదీప్

మునిపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా మర్రి ప్రదీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీటీగా పనిచేసిన కృపానందం జహీరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొండాపూర్‌లో డీటీగా పనిచేసిన ప్రదీప్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్‌కు తహసీల్దార్ గంగాభవాని, కార్యాలయ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

భూ-భారతి పోర్టల్‌పై అవగాహన అవసరం

కోహీర్, ఏప్రిల్ 15: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ-భారతి పోర్టల్‌పై రెవెన్యూ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బాలశంకర్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు.

కిసాన్ క్రెడిట్‌కార్డుతో రైతులకు ప్రయోజనం

జహీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కిసాన్ క్రెడిట్‌కార్డులతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి ప్రదీప్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ శిక్షణలో భాగంగా సమాచారం చేరవేత అంశంద్వారా కిసాన్ క్రెడిట్‌కార్డు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

రైతులకు పట్టా పాసు పుస్తకాలు అందించాలి

కొల్చారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : 50 ఏళ్ల నుంచి సాగులో ఉన్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. కొంగోడుకు చెందిన 50 మంది రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

లబ్ధిదారులకే డబుల్ ఇండ్లు కేటాయించాలి

చేగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్మించిన రెండు పడకల గదులను లబ్ధిదారులకు వెంటనే అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

మే 3న మహాసభలు

మనోహరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మే 3, 4న మెదక్ జిల్లాలో నిర్వహించే సీఐటీయూ 15వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మనోహరాబాద్ మండలంలోని ఇండస్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందులో ప్రధాన కార్యదర్శి బాలేష్, తిరుపతి, రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీను, సుజాత, రాజు, గోవింద్, రవీంద్ర ప్రసాద్ ఉన్నారు.


బీఆర్ఎస్ పటాన్‌చెరు అధ్యక్షుడిగా నాగరాజు

పటాన్‌చెరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడిగా బి.నాగరాజును నియోజకవర్గ కన్వీనర్ ఆదర్శరెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, కార్యవర్గసభ్యులు నియమించారు. మంగళవారం పటాన్‌చెరులో జరిగిన మండల, పట్టణ కార్యకర్తలు, ముఖ్య నాయకుల సమావేశంలో నాగరాజుకు నియామక పత్రం అందజేశారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే

మునిపల్లి/గుమ్మడిదల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తక్కడపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో యానివల్‌డే మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ మాట్లాడారు. గుమ్మడిదల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీడీవో జయరాంనాయక్ పాల్గొని మాట్లాడారు. మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్ పాల్గొని మాజీ సర్పంచ్ తులసీదాస్‌తో కలిసి చిన్నారులకు మెమోంటోలను బహూకరించారు. అలాగే సంగారెడ్డిలోని కిందిబజార్ అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.

వివాహిత అదృశ్యం



సరోజ(ఫైల్)

చిలప్‌చెడ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని రహీంగూడలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన దేవసోత్ సరోజ(35) ఈ నెల 14న భర్త నామ్యతో గొడవపడి వెళ్లిపోయింది. సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సరోజ తండ్రి సునావత్ ప్రభు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తొద్దు: ఎమ్మెల్యే



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర/కౌడిపల్లి/పుల్‌కల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిరిపురం, కొన్యాల, నాగులదేవులపల్లి, గోవిందరాజ్‌పల్లి, హత్నూర, సికింద్లాపూర్ గ్రామాల్లో ఐకేపీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి వీలైనంత త్వరగా డబ్బులు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఐకేపీ ఏపీఎం దేవేందర్, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు బావిలాల నర్సింలు, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కౌడిపల్లి మండలం తునికి, వెంట్రావ్‌పేట్, రాజిపేట్, రాయిలపూర్, నాగ్‌సాన్‌పల్లి, తిమ్మాపూర్, మహ్మద్‌నగర్, వెల్మకన్నె, కౌడిపల్లి, దేవులపల్లి గ్రామాల్లో ఐకేపీ, మహ్మద్‌నగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, మహ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే చౌటకూర్ మండలంలోని తాడ్దానిపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ ప్రారంభించారు.

ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలి: ఆర్డీవో

వెల్దుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లకు రైస్‌మిల్లర్లు, అధికారులు సహకరించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. త్వరలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో సర్వే షురూ

- 'యూడైస్'పై బీఈడీ, డీఈడీ విద్యార్థులు ఆరా



చింతల్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో వివరాలు నమోదు చేస్తున్న బీఈడీ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో మంగళవారం నుంచి సర్వే ప్రారంభమైంది. క్షేత్రస్థాయిలో పరిశీలనకు బీఈడీ, డీఈడీ విద్యార్థులు వెళ్లి పాఠశాలలను తనిఖీ చేయాలనే ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. యూడైస్ ప్లస్‌కు అనుగుణంగా విద్యార్థులున్నారా? ఎంత మంది టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు, వసతులు, సౌకర్యాలపై ఆరాతీసి వివరాలు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా 52 మంది బీఈడీ, డీఈడీ విద్యార్థులు సర్కారు బడుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీవరకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు సర్వే నిర్వహించనున్నారు. సంగారెడ్డి మండలంలోని చింతల్‌పల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్షేత్రస్థాయిలో సర్వేచేశారు. వారివెంట సీఆర్‌పీ దత్తు ఉన్నారు.

పాఠశాల ప్రారంభంనాటికి ఫలితాల పత్రాలు అందించాలి: డీఈవో



రెడ్డిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

చేగుంట ,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల చివరి రోజున విద్యార్థులకు వార్షిక ఫలితాల ప్రోగ్రెస్ కార్డులను అందించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ నెల 23 వేసవి సెలవుల చివరిరోజున ప్రతి విద్యార్థికి పరీక్షా ఫలితాలకు సంబంధించి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రోగ్రెస్ కార్డులను అందించాలని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాబాయ్, ఉపాధ్యాయులు దేశపతి కృష్ణమూర్తి, సురేష్, గోవింద్, రాజశేఖర్, శ్రీదేవి, శంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు

పటాన్‌చెరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని 272 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ఎక్కడా నిధుల కొరత లేకుండా ప్రతి ఒక్క కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్పానగేష్, సింధూఆదర్శరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు ఈర్ల దేవానంద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలాభివృద్ధి

- బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్

హవేళిఘణపూర్/కౌడిపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని తొగిట గ్రామంలో 'గావ్ చలో బస్తీ చలో'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లా నాయకులు రంజిత్‌రెడ్డి, నల్లాల విజయ్, ఏసీ రెడ్డి, సత్యనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంగళవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని సమీకృత బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు తినే భోజనం మీరు తినగలరా? అని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ అధికారులను ప్రశ్నించారు. అలాగే మెదక్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని హాస్టల్ వార్డెన్ నర్సమ్మను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా నాయకులు రాజేందర్, అశోక్, రాకేష్ మహిపాల్, కృష్ణ ఉన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఎమ్మెల్యే ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలుంటే తనను సంప్రదించాలని పేర్కొన్నారు. అంతకుముందు జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాణిక్ ప్రభు, శ్రీశైలం మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, ఉపాధ్యక్షుడు ప్రభు, కోశాధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

వెల్దుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు సన్నబియ్యంతో కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలో రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం పొందిన గిరుకల మల్లేశం, మహేశ్వరి ఇంట్లో మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డిలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరీత్యా చర్యలు

- వ్యవసాయ సంచాలకులు వెంకటలక్ష్మి హెచ్చరిక.. మండలాల డీలర్లతో సమావేశం

కంది, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సంచాలకులు వెంకటలక్ష్మి హెచ్చరించారు. పోతిరెడ్డిపల్లిలోని రైతువేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి, కంది మండలాల ఫర్టిలైజర్ డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని, త్వరలోనే సీజన్ మొదలు కాబోతున్నందున రైతులకు ఇబ్బంది కలగకుండా గోడౌన్లలో ఎరువులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. అలాగే జీరో ఫార్మ్ ఇంక్లూషన్స్ ఎప్పటికప్పుడు విధిగా చేసుకోవాలని సూచించారు. ప్రతి ఎరువుల దుకాణంలో తప్పనిసరిగా లైసెన్స్ కాపీలు అందరికీ కనిపించేలా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కంది మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంగారెడ్డి మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ లక్ష్మీబాయి, ఏవో ప్రతిభ, సంగారెడ్డి, కంది మండలాల ఎరువుల దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలకు చెక్



జహీరాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/నారాయణఖేడ్/రామాయంపేట/నర్సాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని సంగారెడ్డి అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగినపుడు మంటలార్పే విధానాన్ని ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో డీఎం ఉపేందర్, ఉద్యోగులు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక శాఖ అధికారులు శ్రీనివాస్, సలీం, అశోక్ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్, ఎల్ఎఫ్‌వో విఠల్, విజయ్‌కుమార్, సిబ్బంది నబీ, కనకరాజ్, సత్యనారాయణరెడ్డి అవగాహన కల్పించారు. రామాయంపేట పట్టణంలోని రద్దీ ప్రదేశాల్లో అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బంది పోస్టర్లు అంటించారు. నర్సాపూర్ బస్టాండ్‌లో ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది అవగాహన కల్పించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



జహీరాబాద్ : వాల్‌రైటింగ్ రాస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్/మనూరు/మెదక్ మున్సిపాలిటీ/రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాల్‌రైటింగ్స్‌ను చేసి మాట్లాడారు. కనీవిని ఎరుగని రీతిలో రజతోత్సవ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మండల కేంద్రమైన మనూరులోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడారు. మెదక్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వాల్ పెయింటింగ్స్ వేశారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి పీఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో రజతోత్సవ సభ పోస్టర్‌ను బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శరెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ పాల్గొన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ రజతోత్సవ సభపై దిశానిర్దేశం చేశారు.

ఆరు గ్రామాల్లో ఇసుక రీచ్‌ల కోసం స్థల పరిశీలన

వెల్దుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి మండలం హల్దీవాగులోని ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించేందుకు మండలంలోని ఆరు గ్రామాల్లో ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపారు. మైనింగ్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మంగళవారం వెల్దుర్తి గ్రామ శివారు, మేల్లూరు హల్దీవాగు పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఇసుక లభ్యతను పరిశీలించారు. మేల్లూరు హల్దీవాగులో అవసరమైనంత ఇసుక ఉందని గుర్తించామని, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ రాజేందర్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, నీటిపారుదలశాఖ ఏఈ శ్రీకాంత్, భూగర్భ వనరుల శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ, భూగర్భ జలవనరులశాఖ ఆర్ఐ లావణ్య ఉన్నారు.

ఉపాధిహామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర

- వ్య.కా.స రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ముందు వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ విధానాన్ని తీసుకువచ్చి ఫొటోలు తీసేయడం వల్ల సిగ్నల్స్ లేక కూలీలకు రోజు హాజరుపడడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రోజుకు రూ. 300 కూలీ ఎక్కడా రావడం లేదని కేవలం రూ.150 నుంచి రూ.250 వరకు మాత్రమే వస్తుందని తెలిపారు. పెరిగిన ధరలకనుగుణంగా రోజు కూలీ రూ.600 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, రాజు, సుజాత, నర్సింలు, కుమార్, కృష్ణ, రాజేష్, నాగన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధిలో మహిళలకు శిక్షణ

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్ అభివృద్ధి సంస్థ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు గుర్తింపుపత్రాలు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సేవాదృక్పథం ఉండాలి



బోరువేసేందుకు కొబ్బరికాయ కొట్టి పూజలు చేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరిలో సేవాదృక్పథం ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాంనగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో (సొంత నిధులతో) సుమారు రూ.3 లక్షలతో బోర్లను వేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రయోజనాల దృష్ట్యా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

కాలిపోతున్న హరితహారం మొక్కలు



కోహీర్-కవేలి ప్రధాన రహదారి పక్కన నిప్పంటుకొని కాలిపోతున్న మొక్కలు

కోహీర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కోహీర్- కవేలి ప్రధాన రహదారి పక్కన ఉన్న హరితహారంలో నాటిన మొక్కలు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయాయి. ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే ఎండాకాలం కాబట్టి ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు

రామయంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి అక్కన్నపేట, ఝాన్సీ లింగాపూర్ మధ్య గుంతలు పడ్డ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి రోడ్డును సిమెంట్ వేసి పూడ్చారు. రైల్వే ట్రాక్ ఆనుకొని నిర్మించిన సీసీ రోడ్డు నిత్యం పరిశ్రమల లోడ్ లారీలు ప్రయాణించడంతో పెద్దఎత్తున గుంతలు పడ్డాయి. ఝాన్సీ లింగాపూర్ గ్రామ ప్రజల పక్షాన మైనంపల్లి సోషల్ మీడియా ఇన్‌చార్జి రవికుమార్ సదరు కంపెనీలపై ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని కావేరి స్టీల్ ఇండస్ట్రీ యాజమాన్యంతో మాట్లాడారు. వెంటనే సిమెంట్ కలిపిన డస్ట్ వేసి తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపట్టారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

నిజాంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, తూప్రాన్ వీఎస్టీ ఇండస్ట్రీ నిర్వహణలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 240 మంది రోగులకు ప్రత్యేక వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ రాజేష్, తహసీల్దార్ రమ్యశ్రీ మాట్లాడుతూ పేదల సౌకర్యార్థం హెల్త్‌క్యాంపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర మేనేజ్‌మెంట్ సభ్యులు సింగం శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ సీజ్

మునిపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఓ టిప్పర్‌ను కంకోల్ టోల్ ప్లాజావద్ద మునిపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు అనుమతులు లేకుండా ఇసుక టిప్పర్ వెళ్తుందని సమాచారం రావడంతో మునిపల్లి కంకోల్ టోల్‌ప్లాజా పట్టుకున్నారు. వాహనానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌ను సీజ్ చేయడంతో పాటు ఓనర్ ప్రవీణ్, డ్రైవర్ అంకుష్ నవండేలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలప్‌చెడ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన మద్దూరి లక్ష్మయ్య మంజీరానది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సింధూజ హెచ్చరించారు.

చాకరిమెట్లలో విరిగిన విగ్రహానికి పూజలు



చేయి విరిగిన శనీశ్వరుని విగ్రహం

శివ్వంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ ఆలయ సిబ్బంది నిర్లక్ష్యంతో విరిగిన విగ్రహానికి పూజలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. చిన్నగొట్టిముక్ల గ్రామం చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని నిత్యం భక్తులు దర్శించుకుంటారు. నవగ్రహ ఆలయంలో శనీశ్వరుని విగ్రహం కుడిచేయి విరిగి నెలలు గడుస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి విరిగిన విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.